మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 08-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 168

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609



## బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

- 1971 నాటి చరిత్ర పునరావృతమవుతుంది..
- పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి:
- పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్
- భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కవ్వింపులు
- కవ్వింపు చర్యలపై రక్షణ మంత్రి ఆగ్రహం.

**న్యూఢిల్లీ ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. -మిగతా 3 లో



వచ్చే మూడ్రోజులు తెలుగు

## రాష్ట్రాల్లో వర్షాలు

- పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం
- వాతావరణ శాఖ వెల్లడి



**హైదరాబాద్,**
తెలుగు రాష్ట్రల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు -మిగతా 3 లో



## ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

- ఇష్టం లేకపోయినా చర్యలు తప్పడం లేదు
- హర్మూజ్‌ను తెరవకపోతే విధ్వంసం తప్పదు
- మరోమారు ఘాటుగా హెచ్చరించిన ట్రంప్


**వాషింగ్టన్**
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు.మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్ కేంద్రాలను లక్ష్యం

-మిగతా 3 లో

## సౌర విద్యుత్ కేంద్రంగా రాయలసీమ

రాయలసీమలో సౌర విద్యుత్తు ఉత్పత్తి పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలి

- భవిష్యత్తులో ఉత్పత్తయిన విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు అందించేలా ట్రాన్స్‌మిషన్ లైన్లను నిర్మించాలి
- ముఖ్యమంత్రి అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం
- 39,436 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు
- విశాఖలో ఇన్ఫోసిస్.. సీమలో గ్రీన్ ఎనర్జీ యూనిట్లు
- 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం



**అమరావతి, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
సౌర విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంగా రాయలసీమను అభివృద్ధి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రత్యేకంగా రాయలసీమ అధికారులు గరిష్ఠస్థాయిలో సోలార్ విద్యుదుత్పత్తిని సాధించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తి యూనిట్లను ఎక్కువగా రాయలసీమలో ఏర్పాటు చేయాలన్నారు. సీఎంచంద్రబాబు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో మంగళవా రం 16వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది.

ఐదు రాష్ట్రాల్లో

## ఎగ్జిట్ పోల్స్ నిషేధం

- 9వ తేదీ నుంచి 29 వరకు అమలు
- ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ,**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని -మిగతా 3 లో




## ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

- సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు
- వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి

3 లో



రాబోయే 48 గంటలు

## బీ కేర్‌ఫుల్..

- ఇరాన్‌లో భారతీయులకు కేంద్రం అలర్ట్



23 లో

పాకిస్తాన్‌లో

## 'స్మార్ట్ లాక్‌డౌన్'

- చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం



3 లో

## భూగర్భ జలాలను కాపాడుకోవాలి

భూమిపై మనిషికి అవసరమయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది

- జలమే జీవం.. జీవమే జల సంరక్షణకు మూలం.. అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి
- ఉపరితల జలాలతో పాటు తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాలి
- అప్పుడే భవిష్యత్తు తరాలకు భరోసా
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు






**అమరావతి/విజయవాడ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
'జలమే జీవం.. జీవమే జల సంరక్షణకు మూలం.. అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యల నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. మంగళవారం విజయవాడ కానూర్ ఏపీ ఎస్ఐఆర్‌డీ సంస్థలో ఏర్పాటుచేసిన 'గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం' వర్క్‌షాపును ఆయన ప్రారంభించి, మాట్లాడారు. భూమిపై మనిషికి అవసరమయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉందని, దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని స్పష్టం చేశారు. -మిగతా 3 లో




## త్వరలోనే స్థానిక ఎన్నికలు!

- ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన వారంలో ఎస్ఈసీ నియామకం
- గవర్నర్‌కు చేరిన సంబంధిత ఫైలు
- బీసీ జనాభా లెక్క పదిరోజుల్లో పూర్తి
- మరిన్ని వివరాలతో అఫిడవిట్ వేస్తాం
- విషయాలన్నీ పరిగణనలోకి తీసుకోండి
- తర్వాతే ఉత్తర్వులు జారీ చేయండి
- హైకోర్టుకు ఏజీ దమ్మాలపాటి నివేదన

**అమరావతి,**
రాష్ట్రంలోని స్థానిక సంస్థలు, గ్రామపంచాయితీలకు సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ మంగళవారం హైకోర్టుకు నివేదించారు. రానున్న వారం రోజుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) నియామకం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ఎస్ఈసీ నియామకానికి సంబంధించిన ఫైలు గవర్నర్ వద్దకు చేరిందని వివరించారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ చేపట్టిన బీసీ జనాభా లెక్కింపు దాదాపు కొలిక్కి వచ్చిందన్నారు. ఇప్పటివరకు 99.44 శాతం మేరకు వివరాలు సేకరించారని మరో 10 రోజుల్లో ప్రక్రియ పూర్తి -మిగతా 3 లో

## గాజాలో 8 వేల మందికిపైగా చిన్నారులు గల్లంతు




**గాజా : ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
2023 అక్టోబర్ 7న ప్రారంభమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల లక్షలాది మంది మరణించారు. 29 నెలలపాటు జరిగిన ఇజ్రాయిల్ దాడుల వల్ల గాజాలో 21,510 మంది మృతి చెందారు. ఇప్పటికీ 8 వేల మంది చిన్నారులు ఆచూకీ లేరు. బాంబుల దాడికి కూలిపోయిన భవనాల శిథిలాల కింద 2,100 మంది చిక్కుకుపోయారని తాజాగా పాలస్తీనా కేంద్రం వెల్లడించింది. వేలాది మంది చిన్నారులు అదృశ్యమవ్వడంపై పాలస్తీనా ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 200 మంది మైనర్లు ఆచూకీ లేకుండా అదృశ్యమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల వల్లే వారు గల్లంతయ్యారని అనుమానాలున్నాయని పాలస్తీనా కేంద్రం నివేదించింది. ఇజ్రాయిల్ దాడులకు గురైన అత్యంత ప్రభావితమైన ప్రాంతంలోనూ, మానవతా సహాయం కోసం ఎదురుచూసే ప్రదేశాల్లోనూ, ఆహారం కోసం వెతుకున్నప్పుడు గానీ పిల్లలు అదృశమయ్యారని పాలస్తీనా కేంద్రం నివేదిక వివరించింది.

## హెర్ముజ్‌పై యూఎన్ తీర్మానాన్ని వీటో చేసిన రష్యా, చైనా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
హెర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడమే లక్ష్యంగా ఐక్యరాజ్యసమి భద్రతా మండలి ప్రతిపాదించిన తీర్మానాన్ని రష్యా, చైనా వీటో చేశాయి. రెండు దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉంటాయని ఆశతో పదేపదే సవరించిన తీర్మానాన్ని యూఎన్ మంగళవారం ఓటింగ్‌కు ప్రవేశపెట్టింది. తీర్మానానికి అనుకూలంగా 11, వ్యతిరేకంగా 2 ఓట్లు పడగా రెండు దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి కొన్ని గంటల ముందు ఈ ఓటింగ్ జరిగింది. ఒకవేళ ఆ తీర్మానం ఆమోదం పొందినప్పటికీ ఇప్పుడు ఐదవ వారంలోకి ప్రవేశించిన యుద్ధంపై అది ప్రభావం చూపి ఉండేదో లేదో సందేహమే. రష్యా, చైనా తీర్మానాన్ని వీటో చేసే బదులు ఓటింగ్‌కు దూరంగా ఉండేలా చేయడానికి దాన్ని గణనీయంగా బలహీనపరిచినప్పటికీ ఫలితం దక్కలేదు

## యుద్ధంవల్ల పశ్చిమాసియాకు 10 వేల విమాన సర్వీసులు రద్దు : కేంద్రం వెల్లడి




**ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు మొదలైనప్పటి నుంచి భారత విమానయాన సంస్థలు పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తూ వస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం భారత్ నుంచి పశ్చిమాసియాకు మొత్తం 10 వేల విమాన సర్వీసులు రద్దయినట్లు పౌరవిమానయాన శాఖ వెల్లడించింది.యుద్ధానికి ముందు భారత్ నుంచి పశ్చిమాసియాకు రోజుకు 300 నుంచి 350 వరకు విమాన సర్వీసులు నడిచేవి. ఘర్షణల కారణంగా ఆ సంఖ్య ఇప్పుడు 80–90కి పడిపోయిందని పౌరవిమానయాన శాఖ తెలిపింది. ఇదిలావుంటే సుదూర విమాన ప్రయాణాలకు సంబంధించి పైలట్ల 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్' ను డీజీసీఏ తాత్కాలికంగా సడలించింది. విమాన కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకునేందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుందని ఏవియేషన్ మినిస్ట్రీ వెల్లడించింది.

## నిర్దిష్ట కమ్యూనిటీ ఓటర్లను తొలగించిన కేంద్రం :మమతా బెనర్జీ

**కోల్‌కతా :: ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**



ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించారని పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నదియా జిల్లాలోని చక్దాహ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగా నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను తొలగించిందని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించబడిన ఓటర్లకు టిఎంసి అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఓటర్ల జాబితా నుండి సుమారు 91లక్షల పేర్లను తొలగించినట్లు ఎన్నికల కమిషన్ తాజా నివేదిక తెలిపింది. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. తీర్పు అనంతరం సుమారు 60 లక్షల పేర్లలో 32 లక్షల పేర్లను తిరిగి చేర్చినట్లు మమతా బెనర్జీ తెలిపారు.

# మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తత

### ఇంటిపై రాకెట్ దాడి.. ఇద్దరు చిన్నారులు మృతి..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మరోసారి హింసాత్మకంగా మారింది. గుర్తు తెలియని దుండగులు జరిపిన రాకెట్ దాడి కారణంగా ఇద్దరు చిన్నారులు మరణించగా, వారి తల్లి గాయపడింది. దీంతో ఘటన జరిగిన బిష్ణాపూర్ జిల్లాలో ఆందోళనలు చెలరేగాయి. ఈ కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో అధికారులు ఇంటర్నెట్ బంద్ చేశారు. పలు చోట్ల కర్ఫ్యూ విధించారు. మణిపూర్‌లో కొన్నేళ్లుగా మైటీ, కుకీ తెగల మధ్య ఘర్షణ ఉన్న సంగతి తెలిసిందే.గతంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాల్లో బిష్ణాపూర్ జిల్లా కూడా ఒకటి. ఈ జిల్లాలోని మోయిరంగ్ ప్రాంతంలోని ట్రోంగ్లాబి అవాంగ్ లైకై అనే గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత ఒక ఇంటిపై కొందరు దుండుగులు రాకెట్ దాడి చేశారు. ఈ దాడిలో ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు పిల్లలు మరణించారు. వారి తల్లి గాయపడ్డారు. మృతుల్లో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల పాప ఉంది. ఈ దాడి ఘటనతో మరోసారి ఈ ప్రాంతంలో ఉద్రిక్తత తలెత్తింది. స్థానికులు భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. దగ్గర్లోని ఆయిల్ ట్యాంకులు, ట్రక్కులు తగలబెట్టారు. ఆస్తులు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు, భద్రతా దళాలు అక్కడికి చేరుకుని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో 19 వరకు గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలు మరింత చెలరేగకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తప్పుడు సమాచారం వ్యాపించకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా బిష్ణాపూర్‌తోపాటు మరో నాలుగు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఈ ఘటనను మణిపూర్ సీఎం వై ఖేంచంద్ సింగ్ ఖండించారు. ఇంటిపై రాకెట్‌తో దాడి చేయడాన్ని తీవ్రవాద చర్యగా అభివర్ణించారు. మరోవైపు కుకీ తెగల వాళ్లే ఈ దాడి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

---

# ఎల్‌డిఎఫ్ విజయం తథ్యం

- ప్రజల మద్దతు మాకే..
- 2021 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుంటాం
- వివిధ స్థాయిల్లో యుడిఎఫ్‌ను ప్రజలు తిరస్కరించారు
- బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు ఖాళీ చేతులే
- కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
: కేరళలో ఈ నెల 9న జరగనున్న ఎన్నికలు నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎల్‌డిఎఫ్ విజయం పట్ల ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. దశాబ్దకాలంగా అధికారంలో ఉన్నప్పటికీ సిపిఎం నేతృత్వంలోని కూటమికి ప్రజల మద్దతు కొనసాగుతోందని ఆయన అన్నారు. కేరళలోని కన్నూర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పినరయి విజయన్ మాట్లాడారు. ప్రజలతో తాను ఇటీవల జరిపిన సంభాషణల ఆధారంగా మొత్తమ్మీద ప్రజల వాతావరణం లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు అనుకూలంగానే ఉందని పేర్కొన్నారు. 'ఇక్కడి ప్రజలతో మా సంభాషణల ద్వారా మాకు అర్థమైన విషయం ఏమిటంటే, కేరళ ప్రజల మనస్తత్వం ఎల్‌డిఎఫ్‌తోనే ఉంది' అని అన్నారు. 'వివిధ స్థాయిల్లో యుడిఎఫ్‌ను తిరస్కరించారు' అని పేర్కొన్నారు. ఎల్‌డిఎఫ్ విజయంపై ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2021 ఎన్నికల కంటే ఎక్కువ సీట్లు గెలుచుకుని, మరింత బలమైన ప్రజాదరణతో ఎల్‌డిఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని విజయన్ అన్నారు. రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఖాళీ చేతులతో నిండిపోతుందని కూడా ఆయన పేర్కొన్నారు. కేరళలో సిపిఎం–బిజెపి మధ్య అవగాహన ఉందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల పట్ల పినరయి విజయన్ తీవ్రంగా స్పందించారు. ఆ ఆరోపణను తోసి పుచ్చుతూ 'ఆయన కొన్ని నిరాధారమైన ఆరోపణలు చేశారు. జవాబుదారీతనంతో మాట్లాడి ఉండాల్సింది' అని హితవు పలికారు. కాంగ్రెస్ రాజకీయ విధానాన్ని ప్రశ్నిస్తూ, అరవింద్ కేజ్రివాల్ వంటి నాయకుల పట్ల ఆ పార్టీ వైఖరిని విజయన్ ప్రస్తావించారు. 'తమ ప్రత్యర్థిని ఓడించాలనే ఆత్రుతలో.. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ వ్యవహరించిన తీరు చివరికి బిజెపికి సహాయపడింది' అని అన్నారు. అవినీతి ఆరోపణలపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్‌ను సిబిఐ అరెస్టు చేసినప్పుడు కాంగ్రెస్ అండగా నిలవలేదని, బిజెపి చర్యలకు మద్దతు ఇచ్చిందని విమర్శించారు. 'అది బిజెపికి సమర్థవంతమైన మద్దతు కాదా?' అని ఆయన ప్రశ్నించారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల్లో పాల్గొనందుకు కేరళలోని కాంగ్రెస్‌ను కూడా పినరయి విజయన్ విమర్శించారు. 'మేము నిరసనలు నిర్వహించిన ప్పుడు... కాంగ్రెస్, యుడిఎఫ్ నాయకులను ఆహ్వానించాం. కానీ వారు పాల్గొనేందుకు నిరాకరించారు' అని ఆయన గుర్తుచేశారు. ఇలాంటి సమస్యలు 'కేవలం ఎల్‌డిఎఫ్‌కు మాత్రమే సంబంధించినవి కావు. ఇది కేరళ ఉమ్మడి సమస్య. కేరళకు కేంద్రం సృష్టించిన ఒక్క సమస్యకు వ్యతిరేకంగా కూడా కాంగ్రెస్ పోరాటం చేయలేదు' అని ఆయన విమర్శించారు.

శబరిమల మహిళల ప్రవేశం విషయంలో, జాగ్రత్తతో కూడిన, సంప్రదింపుల వైఖరిని అవలంబిస్తామన్న విషయాన్ని పినరయి విజయన్ పునరుద్ఘాటించారు. 'ఇలాంటి విషయాలు తలెత్తినప్పుడు -- ముఖ్యంగా అవి ఆచారాలు, సంప్రదాయాలకు సంబంధించినవి అయినప్పుడు -- పరిగణనలోకి తీసుకోవాల్సిన కొన్ని షరతులు ఉంటాయి' అని అన్నారు. ఏకపక్ష నిర్ణయాలకు బదులుగా 'పండితులు, సామాజిక సంస్కర్తలు' చర్చలలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

ఫిరాయింపులను ప్రస్తావిస్తూ 'బిజెపి ఎంపిలలో సుమారు 30 శాతం మంది కాంగ్రెస్ నుంచి వచ్చినవారే' అని ఆయన పేర్కొన్నారు. ఇది పార్టీలోని వైరుధ్యాలనే ప్రతిబింబిస్తోందని సూచించారు. వరద నిర్వహణలో తమ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని అన్నారు. అందుకు నిపుణుల పరిశోధనలు స్పష్టంగా ఉన్నాయని అన్నారు. 'ఇది మానవ జోక్యం వల్ల సంభవించలేదు. పూర్తిగా ప్రకృతి వైపరీత్యాల వల్లే జరిగింది' అని ఆయన చెప్పారు. అంబలప్పుజ నుంచి యుడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ నాయకుడు జి సుధాకరన్, సిపిఎం మహిళా నాయకురాలిపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అటువంటి వ్యాఖ్యలు 'ఒక బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడు చేయకూడనివి' అని, కాంగ్రెస్‌తో చేతులు కలిపిన తరువాత ప్రమాణాలు పడిపోవడాన్ని అవి ప్రతిబింబిస్తున్నాయని ఆయన అన్నారు.

# ఇరాన్ పౌరులకు ఇజ్రాయెల్ హెచ్చరిక..


### 12 గంటలపాటు రైళ్లకు దూరంగా ఉండాలని సూచన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
ఇరాన్–ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం ఇంకా తీవ్రమవుతోంది. ఇరాన్‌పై మరిన్ని భీకర దాడులకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ ఒక హెచ్చరిక జారీ చేసింది. రైల్వే వ్యవస్థలకు, రైళ్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ముఖ్యంగా 12 గంటలపాటు రైళ్లలో ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది. స్థానిక కాలమానం ప్రకారం ఇప్పటి నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇరాన్‌లోని ఏ రైళ్లలో అయినా ప్రయాణించడం మానేయండి అని ప్రజల్ని హెచ్చరిస్తూ ఎక్స్‌లో ఇజ్రాయెల్ మిలిటరీ ఒక ప్రకటన జారీ చేసింది.వారి భద్రత కోసమే ఈ వార్నింగ్ ఇస్తున్నట్లు తెలిపింది. రైళ్లలో లేదా రైల్వే లైన్ల సమీపంలో ఉంటే ప్రాణాలకు ముప్పు తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్ ఇరాన్‌పై సోమవారం భారీ దాడులు నిర్వహించింది. అసలుయేహ్లోని పెట్రో కెమికల్ స్థావరాలపై దాడి చేసింది. ఇరాన్‌కు అవసరమైన చమురులో 50 శాతం అందించే స్థావరంపై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇది దేశంలోనే అతిపెద్ద చమురు స్థావరం. దక్షిణ పర్స్ గ్యాస్ ఫీల్డ్‌పై దాడి జరిగినట్లు ఇరాన్ మీడియా కూడా ధృవీకరించింది. ఈ ప్రదేశంపై దాడి జరగడం అంటే ఇరాన్‌కు భారీ ఆర్థిక నష్టం కలిగినట్లే. దీని విలువ వందల కోట్ల డాలర్లు ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది. గతవారం కూడా మరో పెట్రో స్థావరంపై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ రెండు చమురు స్థావరాలు ఇరాన్‌లో 85 శాతం ఆయిల్ అందిస్తాయి. ఈ రెండింటి వల్ల ఇప్పుడు ఇరాన్‌లోనూ సంక్షోభం తలెత్తింది. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తోంది. సౌదీ, బహ్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై ఇరాన్ దాడి చేసింది. ఒక సౌదీని, బహ్రెయిన్‌ను కలిపే రోడ్డును సౌదీ మూసేసింది. మరోవైపు హార్ముజ్ జలసంధిని తెరవాలని ట్రంప్ విధించిన గడువు కూడా నేటితో పూర్తవుతుంది. రాత్రి 8 గంటలలోపు హార్ముజ్ తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించిన సంగతి

# వందేభారత్ రైలు ఆహారంలో పురుగు..

### తయారీ సంస్థకు రూ.10 లక్షల జరిమానా




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
వందేభారత్ రైళ్లలో ప్రయాణికులకు అందించే ఆహారం నాణ్యత విషయంలో ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నాయి. అయినప్పటికీ అప్పుడప్పుడూ నాణ్యత, శుభ్రత లేని ఆహారం, పురుగులతో కూడిన ఆహారం అందిస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇటీవల ఒక ప్రయాణికుడికి వందేభారత్ రైలులో అందించిన ఆహారంలో ఏకంగా ఒక పురుగు కనబడింది. దీంతో షాక్‌కు గురైన ప్రయాణికుడు దీన్ని వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది.దీనిపై స్పదించిన ఐఆర్‌టీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) సంస్థ ఫుడ్ కాంట్రాక్టర్‌కు భారీ జరిమానా విధించింది. ఆదిత్య దిద్వానియా అనే ప్రయాణికుడు అహ్మదాబాద్ నుంచి ముంబైకి వందేభారత్ రైలులో ప్రయాణించాడు. ఈ సందర్భంగా అతడికి రైలులో ఆహారం అందించారు. అయితే, అతడికి అందించిన ఆహారం తింటుండగా మధ్యలో ఒక పురుగు కనపడింది. అలాగే, తనతోపాటు అదే కోచ్‌లో ఇంకొకరికి కూడా అలాగే పురుగులు వచ్చాయి. దీంతో ఆ కోచ్‌లో ఇతరులు ఎవరూ ఆహారం తీసుకోలేదని తెలిపాడు. ఇక, ఈ అంశానికి సంబంధించి వీడియో తీసి, అతడు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశాడు. దీనికి ఐఆర్‌టీసీ స్పదించింది. ఆదిత్య దగ్గరినుంచి వివరాలు సేకరించింది.ఫుడ్ అందించిన కాంట్రాక్ట్ సంస్థకు రూ.10 లక్షల జరిమానా విధించినట్లు, కాంట్రాక్ట్ రద్దు చేసినట్లు తెలిపింది. అలాగే, కిచెన్ సీజ్ చేసినట్లు కూడా వెల్లడించింది. శుభ్రత, ప్రయాణికుల ఆరోగ్యానికి తాము ప్రాధాన్యమిస్తామని పేర్కొంది. అయితే, ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా ఐఆర్‌టీసీ తగిన చర్యలు తీసుకోవాలని, కిచెన్‌లను అధికారులతో నిత్యం తనిఖీ చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

మొదటి తరువాయి

కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్‌ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సౌర విద్యుత్ కేంద్రంగా రాయలసీమ


మొదటి తరువాయి



పరిశ్రమ లు, విద్యుత్తు, టూరిజం, ఐటీ, ఆహార తయారీ రం గాలకు చెందిన 31 ప్రాజెక్టుల ద్వారా రూ. 39,436.84 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదించింది. ఈ పెట్టుబడుల ద్వారా 1,11,276 మందికి ఉద్యోగావకాశాలు దక్కుతాయని సంస్థలు ప్రతిపాదించాయి. రాయలసీమలో సౌర విద్యుత్తు ఉత్పత్తి పెట్టుబడులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఉత్పత్తి అయిన విద్యుత్తును రాష్ట్ర, సెంట్రల్ గ్రిడ్‌కు అనుసంధానం చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. భవిష్యత్తులో ఉత్పత్తయిన విద్యుత్తును ఇతర రాష్ట్రాలకు అందించేలా ట్రాన్స్‌మిషన్ లైన్లను నిర్మించాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రాజస్థాన్‌లో సౌర విద్యుత్తు ఉత్ప త్తి అవుతున్నా ట్రాన్స్‌మిషన్ లైన్లు లేకపోవడంతో పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేదన్నారు. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని రాయలసీమ ప్రాంతంలో గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గ్రీన్ విద్యుత్తును రాష్ట్రవ్యాప్తంగా వినియోగించుకునేలా ట్రాన్స్‌మిషన్ లైన్లను వేయాలని చెప్పారు. సీఎం ఇంకా ఏమన్నారంటే.. 'రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)లను స్థాపించేలా దృష్టి సారించాలి. రాష్ట్రం జీసీసీలకు కేం ద్రంగా మారాలి. వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వారంగంలోని వ్యర్థాలనూ సద్వినియోగం చేసేలా బై ప్రొడక్టు యూనిట్లను ప్రోత్సహించాలి. పరిశ్రమల్లో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ఉండాల్సిందే. సే ఫ్టీ స్టాండర్డ్స్‌ను నిర్దేశించాలి. ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎన ర్జీ, బీఈఎ?సలాంటి ప్రాజెక్టులు ఏర్పాటవుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేకంగా ఓ స్టాం డర్డ్ ఆఫ్ ప్రొసీజర్(ఎస్ఓపీ)ని సిద్ధం చేయాలి. విప త్తు నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా ఈ భ ద్రతా ప్రమాణాలను పారిశ్రామిక యూనిట్లు కలిగి ఉండాలి. ఇటీవల రాష్ట్రంలోని బాణసంచా తయారీ యూనిట్లలో ప్రమాదాల నేపథ్యంలో ప్రత్యేకంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

# ఈ యేడు వర్షాలు అంతంత మాత్రమే

**-సగటుకన్నా తక్కువ వర్షపాతం నమోదు**
**-వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడి**



**న్యూఢిల్లీ,**
భారత్‌లో ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాలు కొనసాగే వర్షాకాలం రెండో భాగమైన జూన్-సెప్టెంబర్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ వెల్లడించింది. నైరుతి రుతుపవనాల కాలంలో దీర్ఘకాలిక వర్షపాతం సగటున 868.6 మిల్లీమీటర్లు కాగా, అందులో 94 శాతం వర్షాలు మాత్రమే పడే అవకాశాలున్నాయని తెలిపింది. 2026 వర్షాకాలం సీజన్‌లో నమోదయ్యే వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ వచ్చే వారంలో విడుదల చేయనుంది. భారత్‌లో ఏడాదిలో నమోదయ్యే వర్షపాతంలో దాదాపు 70 శాతం వరకూ నైరుతి రుతుపవనాల వల్లే సాధ్యమవుతుంటుంది. నైరుతి రుతుపవనాలు జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ వరి, పత్తి, చెరుకు సహా ఖరీఫ్ పంటల సాగుకు కీలకమవుతాయి. సాధారణంగా జూన్ 1 లేదా మొదటి వారంలో కేరళను రుతుపవనాలు తాకి, జూలై 15 నాటికి ఉత్తరాది సహా దేశమంతటా విస్తరిస్తాయి. కాగా, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకూ వచ్చే ఈశాన్య రుతుపవనాలు స్వల్పకాలికమే అయినా అగ్నేయ భారతదేశానికి, ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు కీలకం. శీతాకాలంలో మధ్యధరా ప్రాంతం నుంచి వచ్చే అల్పపీడన వ్యవస్థల కారణంగా తేలిక పాటి నుంచి భారీ వర్షాలు, మంచు కురియడానికి కారణమవుతుంటాయి. అయితే ఈ వర్షాలు ఉత్తరభారతదేశంలో కీలకమైన రబీ పంటలు, ముఖ్యంగా గోధుమలకు చాలా ఉపయోగకరం.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

మొదటి తరువాయి

పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు. ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.

# త్వరలోనే స్థానిక ఎన్నికలు!

మొదటి తరువాయి

కానుందని తెలిపారు. స్థానిక సంస్థల్లో బీసీ కోటా ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఏర్పాటు చేసిందని, బీసీల వెనుకబాటుతో పాటు అన్ని అంశాలను పరిశీలించే అధికారం కమిషన్‌కు ఉందని పేర్కొన్నారు. పంచాయితీల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,096 గ్రామపంచాయితీల పాలనా వ్యవహారాలు చూసుకునేందుకు 5,770 మంది ప్రత్యేక అధికారులను నియమించినట్టు తెలిపారు. వారు బాధ్యతలు కూడా తీసుకున్నారని నివేదించారు. అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేస్తామని, దానిని పరిశీలించాక తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం.. అఫిడవిట్ దాఖలు చేసేందుకు సమయం ఇస్తూ విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.ఇవీ.. వ్యాజ్యాలు రాష్ట్రంలో బీసీ జనగణన చేపట్టడంతో పాటు తదనుగుణంగా రిజర్వేషన్ ఖరారు చేయాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు కోరుతున్నారు. ఆ ప్రక్రియ పూర్తయ్యాకే స్థానిక సంస్థలు, గ్రామపంచాయితీలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 2025లో హైకోర్టులో పిల్ వేశారు. మరోవైపు రాష్ట్రంలోని 13,325 గ్రామపంచాయితీలు, 123 పట్టణ స్థానిక సంస్థలకు త్వరలో పదవీకాలం ముగియనుందని, ఎన్నికల నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేశ్ మరో పిల్ దాఖలు చేశారు. గ్రామ పంచాయితీ సర్పంచులుగా తమ పదవీకాలాన్ని పొడిగించాలని కోరుతూ మరికొందరు సర్పంచులు వ్యాజ్యాలు వేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై మంగళవారం హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. కేశన తరఫున సీనియర్ న్యాయవాది ఎ. సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. "బీసీ జనగణన చేపట్టాలని హైకోర్టు తీర్పులు ఉన్నాయి. కోర్టు ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ జీవోలో బీసీ జన గణన చేపట్టాలని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొనలేదు. బీసీ గణన చేపట్టకుంటే రిజర్వేషన్ ఖరారులో బీసీలకు అన్యాయం జరుగుతుంది." అని వివరించారు. మరో పిటిషనర్, న్యాయవాది తాండవ యోగేశ్ వాదనలు వినిపిస్తూ.. "నిబంధనల ప్రకారం పదవీకాలం ముగియకముందే ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎస్ఈసీ, రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం తీర్పును పరిగణనలోకి తీసుకుని తక్షణం ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి." అని కోరారు. సర్పంచుల తరఫున న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల నిర్వహణ పూర్తయ్యేవరకు సర్పంచుల కాలపరిమితిని పొడిగించాలని అభ్యర్థించారు.

# ఇరాన్ నాగరికత అంతమైపోవడం ఖాయం

మొదటి తరువాయి

చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్ లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.


# ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

మొదటి తరువాయి

ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

# పాకిస్తాన్‌లో 'స్మార్ట్ లాక్‌డౌన్'

**చమురు సంక్షోభంతో కీలక నిర్ణయం**



**న్యూఢిల్లీ,**
ఇరాన్ యుద్ధం ప్రభావం పాకిస్తాన్‌పై గట్టిగా పడుతోంది. హోర్ముజ్ జలసంధి మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాకిస్తాన్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. చమురు కొరత ప్రభావంతో ఇప్పటికే దేశంలో పలు ఆంక్షలు విధించిన పాక్ ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో 'స్మార్ట్ లాక్‌డౌన్' విధిస్తూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆదేశాలు జారీ చేశారు. చమురు కొరతపై రాష్ట్రాల సీఎంలతో సమావేశం అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నాడు.చమురు వినియోగాన్ని తగ్గించేందుకు, ఉన్న నిల్వల్ని కాపాడుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాక్ ప్రధాని చెప్పాడు. 'స్మార్ట్ లాక్‌డౌన్' పై స్థానిక రేడియో వెల్లడించిన వివరాల ప్రకారం.. పాక్‌లోని పంజాబ్, ఖైబర్ పక్తుంఖ్వా, బలూచిస్తాన్, ఇస్లామాబాద్, గిల్గిత్ బల్తిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో పలు ఆంక్షలు విధించారు. మార్కెట్లు, షాపులు, ఇతర కమర్షియల్ స్పేసెస్ అన్నీ రాత్రి ఎనిమిది గంటలకు మూసేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మినహాయింపులు ఇచ్చారు. అక్కడ రాత్రి 9 గంటల వరకు అనుమతి ఉంటుంది. జనరల్ స్టోర్స్, డిపార్ట్‌మెంట్ స్టోర్స్ వంటివి ఎనిమిది గంటలకే మూసేయాలి. అలాగే, బేకరీలు, రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ ఔట్‌లెట్లు మాత్రం రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచొచ్చు. అలాగే, పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. రాత్రి 10 గంటల తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడుకలు తక్కువ మందితో నిర్వహించుకోవాలి. మెడికల్ స్టోర్స్, ఫార్మసీలు మాత్రం ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచే అమలు చేయబోతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. కొన్ని చోట్ల ప్రైవేటు వాహనాలపై నిషేధం విధించారు. అలాగే, ప్రభుత్వ రవాణా ఉచితంగా అందిస్తున్నారు. నెల రోజులపాటు గిల్గిత్, ముజఫరాబాద్ వంటి చోట్ల ఉచిత ప్రయాణం చేయవచ్చు. హోర్ముజ్ జలసంధి తెరిచి, చమురు అందుబాటులోకి వచ్చే వరకు ఈ పరిస్థితి ఉంటుందని పాక్ అధికార వర్గాలు తెలిపాయి.

# రాబోయే 48 గంటలు బీ కేర్‌ఫుల్..

**ఇరాన్‌లో భారతీయులకు కేంద్రం అలర్ట్**



**న్యూఢిల్లీ,**
ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఇరాన్ లో నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలు చేసింది. రాబోయే 48 గంటలపాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఇరాన్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీచేసిన అలర్ట్‌లో పలుకీలకమైన సూచనలు ఉన్నాయి. 'తదుపరి 48 గంటలపాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. పెద్దపెద్ద బంగళాల్లో ఉండే వారు పైఅంతస్తుల్లో ఉండొద్దు' అని స్పష్టంచేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 7-8 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించాడు. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని వార్నింగ్ ఇచ్చాడు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టంచేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈ-మెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది.

# భూగర్భ జలాలను కాపాడుకోవాలి

మొదటి తరువాయి

'నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఏపీ దేశంలోనే ముందు వరుసలో ఉందంటే.. సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే సవాల్ ఇప్పుడు మనందరి ముందుంది. ఉపరితల జలాలతో పాటు తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణతో పాటు వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసా ఇచ్చినట్లు అవుతుంది" అని పవన్ పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికీ తగినంత తాగునీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీరు ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోందని, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామా ల్లో వేసవిలో నీటి ఎద్దడిని తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా '100 రోజుల నీటి వినియోగ డ్రైవ్' కార్యక్రమాన్ని ఏప్రిల్ 6నుంచి జూలై 14 వరకు చేపట్టిందని పవన్ తెలిపారు. దీనిలో భాగంగా ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాలు పెంచడం, నీ టి వృథాను అడ్డుకోవడం వంటి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. వర్క్‌షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పీసీబీ చైర్మన్ పి.కృష్ణయ్య, ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు, జేడీ కేఎస్ వరప్రసాద్, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !



రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్కితుకునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధఙకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# చందమామలో ఎన్నెన్నో వర్ణాలు..

### అనూహ్యమైన రంగుల్ని గుర్తించిన ఆస్ట్రోనాట్స్

**టెక్సాస్: ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):** ఆర్టెమిస్-2 వ్యోమగాములు .. చంద్రుడి ఉపరితలంపై అనూహ్యమైన రంగులను గుర్తించారు. చంద్రుడిని చుట్టువచ్చే క్రమంలో .. చల్లటి జాబిలిపై మల్టీఫుల్ కలర్స్ ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చందమామ సమీపం నుంచి బ్రౌన్ రంగులో కనిపించినట్లు చెప్పారు. ఇక అక్కడక్కడ మూన్‌పై గ్రీన్ కలర్ ఛాయలు కూడా కనిపించినట్లు తెలిపారు. కానీ చాలా వరకు చంద్రుడి ఉపరితలం మొత్తం బ్రౌన్ రంగులోనే ఉన్నట్లు పేర్కొన్నారు. కొన్ని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గ్రీన్ వర్ణంలో వెన్నెలరాజు దర్శనమిచ్చినట్లు వెల్లడించారు. చంద్రుడిని ఎంత తీక్షణంగా చూస్తే, ఆ ఉపరితలం అంత బ్రౌన్ రంగులో మెరిసినట్లుగా ఉందని మిషన్ స్పెషలిస్టు క్రిస్టినా కౌచ్ తెలిపారు. నాసా ట్రాన్స్‌మిషన్‌తో మాట్లాడుతూ.. ఇది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉందని ఆమె అన్నారు. ఇక కెనడా ఆస్ట్రోనాట్ జెర్మీ హన్సెన్ మరో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆరిస్టార్చస్ పీఠభూమి వద్ద చంద్రుడి




వర్ణం గ్రీన్‌గా ఉందని అన్నారు. చంద్రుడిలోని ఆ చీలక చాలా కొత్తదని, ఇక్కడ ఉన్న కలరేషన్ చాలా విశిష్టంగా ఉన్నట్లు ఆ ఆస్ట్రోనాట్ పేర్కొన్నారు. మూన్‌పై మరోచోట ఇలాంటి రంగు కనిపించలేదన్నారు.చంద్రుడిని చుట్టి వచ్చే క్రమంలో.. భూమి నుంచి దూరంగా ఆర్టెమిస్-2 వ్యోమనౌక వెళ్లినట్లు నాసా అడ్మినిస్ట్రేటర్ జేర్డ్ ఐజాక్‌మాన్ పేర్కొన్నారు. భూమి నుంచి సుమారు 2 లక్షల 50 వేల మైళ్ల దూరం ఆర్టెమిస్ ప్రయాణించినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి ఏడు గంటలకు ఆర్టెమిస్‌లో ఉన్న నలుగురు ఆస్ట్రోనాట్లు రీడ్ వైజ్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, జెర్మీ హన్సెస్ భూమికి సుమారు 2,52,756 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు తెలిపారు. చరిత్రలో గతంలో ఎప్పుడూ కూడా మనుషులు ఇంత దూరం ప్రయాణించలేదన్నారు. ఆర్టెమిస్-2లో పాల్గొన్న సిబ్బందికి ఆయన కంగ్రాట్స్ తెలిపారు. ఆర్టెమిస్‌లో ప్రయాణించిన వ్యోమగాములను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. వారితో ఆయన మాట్లాడారు. మీరు చరిత్ర సృష్టించినట్లు చెప్పారు. అమెరికన్లు అందరూ గర్వపడేలా చేశారన్నారు. ఎంతో గర్వంగా ఉందని కూడా ట్రంప్ ఆ టీమ్‌తో పేర్కొన్నారు. నలుగురు ఆస్ట్రోనాట్లు చాలా ధైర్యవంతులు అని ప్రశసించారు. ఆధునిక కాలానికి చెందిన మార్గదర్శకులని అన్నారు. అంతరిక్ష రంగంలో అమెరికా అద్భుతాలు సాధించిందని, ఇక నక్షత్రాలనే లక్ష్యంగా ముందుకు వెళ్లనున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# మేము సైతం!.. సైన్యంలోకి 12 ఏండ్ల పిల్లలు, మాజీ సైనికులు

**-1.40 కోట్ల మందితో స్వచ్ఛంద సేన ఏర్పాటు**
**-విద్యుత్తు కేంద్రాలు, వంతెనల రక్షణకు మానవ హారాలు**
**-అమెరికా భూతల దాడులకు ఇరాన్ సర్వ సన్నద్ధం**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):** హెర్మూజ్ జలసంధిపై డొనాల్డ్ ట్రంప్ విధించిన గడువు ముగియడానికి కేవలం మరికొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉండగా అమెరికాతో సుదీర్ఘమైన, భయంకరమైన ఘర్షణకు ఇరాన్ సన్నద్ధమవుతున్నది. ఇటీవలి అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో పలువురు అధికారులను కోల్పోయినప్పటికీ ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గేందుకు నిరాకరించింది. దీంతో ఈ యుద్ధం భూతల దండయాత్రగా మారవచ్చనే భయాలు పెరుగుతున్నాయి. దీనికి ప్రతిస్పందనగా ఇరాన్ అపూర్వ స్థాయిలో సైన్యాన్ని సమీకరిస్తున్నది. లక్షలాది మంది పోరాడేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. పిల్లలను సైతం సైన్యంలోకి అనుమతిస్తున్నారు. చివరి రక్షణ మార్గంగా మానవ హారాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ భూతల



దాడులకు దిగితే దేశం కోసం పోరాడేందుకు 1.40 కోట్ల మంది ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక టీవీ మంగళవారం తెలిపింది. ప్రజలు స్వచ్ఛందంగా యుద్ధంలో పాల్గొనాలని ప్రభుత్వ మీడియా, వాట్సాప్ సందేశాలు ప్రజలకు పిలుపునిచ్చాయి. యుద్ధంలో పాల్గొనడంపై తమ ఆసక్తిని తెలియచేయాలని రిటైర్డ్ సైనికులకు సైతం ప్రభుత్వం పిలుపునిచ్చింది.

**యుద్ధంలో పిల్లలు**

పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన ఆల్ వలంటీర్ బసీజ్ ఫోర్స్ సుమారు 12 ఏండ్ల పిల్లలను సైతం తమ దళంలో చేర్చుకుంటున్నాయి. వారి నియామకాన్ని యుద్ధ నేరమని ప్రకటించిన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పిల్లలు ఆయుధాలు కూడా పట్టుకుంటారని హెచ్చరించింది. ఇరాన్ కోసం అనే నినాదంతో పిల్లలను చేర్చుకుంటున్నామని, వారు గస్తీలు, చెక్‌పాయింట్లు, సరుకుల రవాణా వంటి కార్యకలాపాల్లో సహాయపడతారని గార్డ్స్ ఇన్ టెహ్రాన్‌కు చెందిన సాంస్కృతిక అధికారి రహీం నదాలీ తెలిపారు. సైనిక కార్యకలాపాల్లో పిల్లలను వాడడాన్ని నిషేధిస్తూ బాలల హక్కుల ఒప్పందానికి ఇరాన్ కూడా కట్టుబడి ఉన్నప్పటికీ ఈ పరిణామం తలెత్తడం ఆందోళనకరం. స్వచ్ఛంద కార్యకర్తల కనిష్ఠ వయసును 12 సంవత్సరాలుగా నిర్ణయించామని ఆయన చెప్పారు. సైనిక సిబ్బంది సెక్యూరిటీ చెక్‌పాయింట్ల వద్దకు తమ పిల్లలను పంపాలని ఇరాన్ సీనియర్ మిలిటరీ కమాండర్ జనరల్ హుస్సేన్ ఎక్తా ప్రభుత్వ టీవీలో వారి తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు.

---

# ఆర్టెమిస్‌లో 40 నిమిషాల బ్లాకౌట్.. సూర్య గ్రహణాన్ని వీక్షించిన ఆస్ట్రోనాట్స్

**న్యూయార్క్ ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):** ఆర్టెమిస్-2 మిషన్‌లో భాగమైన ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్.. చంద్రుడి ఆవలి వైపు నుంచి ప్రయాణించింది. ఆ సమయంలో సుమారు 40 నిమిషాల పాటు ఆ స్పేస్‌క్రాఫ్ట్‌లో బ్లాకౌట్ అయ్యింది. అమెరికా కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 6.44 నిమిషాలకు ఆ బ్లాకౌట్ ప్రారంభమైంది. నాసా ప్రకారం మళ్లీ రాత్రి 7.25 నిమిషాలకు బ్లాకౌట్ ముగిసింది. అయితే ఆ సమయంలో స్పేస్‌క్రాఫ్ట్‌ను చిమ్మచీకట్లు కమ్మేశాయి. చంద్రుడి ఆవల చీకటి వైపు ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ ఉన్న సమయంలో వ్యోమగాములు అనేక పరీక్షలు నిర్వహించారు. మిషన్ కంట్రోల్‌తో లింకు లేకున్నా.. వ్యోమగాములు మాత్రం శాస్త్రీయ పరిశోధనలు చేపట్టారు. చంద్రుడికి మరో వైపు ఉన్న సమయంలో.. ఆస్ట్రోనాట్స్ ఒంటరి అయిపోయారు. వారితో ఎటువంటి కమ్యూనికేషన్ జరగలేదు. భూమికి, స్పేస్‌క్రాఫ్ట్‌కు మధ్య చంద్రుడు ఉండడం వల్ల సిగ్నల్ అందదు. దీనితో బ్లాకౌట్ జరుగుతుంది. అయితే ఆ సమయంలో చంద్రుడి చీకటి ప్రదేశాన్ని ఆస్ట్రోనాట్స్ స్టడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ టైంలోనే అపోలో 13 రికార్డును ఆర్టెమిస్ వ్యోమగాములు బ్రేక్




చేశారు. అపోలో 13 కన్నా సుమారు 4 వేల మైళ్లు అధిక దూరం ఆర్టెమిస్ వ్యోమగాములు ప్రయాణించారు.ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఉన్న వ్యోమగాములు.. సూర్య గ్రహణాన్ని వీక్షించారు. అద్భుతమైన ఆ క్షణాలను వ్యోమగాములు ప్రత్యక్షంగా అనుభవించారు. చంద్రుడికి అతి సమీపం నుంచి సూర్య గ్రహణాన్ని మనుషులు వీక్షించడం చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుంది. చంద్రుడు భ్రమణ సమయంలో ఆర్టెమిస్ సిబ్బంది అనూహ్యమైన సూర్యాస్తమయాన్ని వీక్షిస్తారు. ఆ సమయంలో సోలార్ కరోనా ఏర్పడనుతుంది. ఇదే సమయంలో ఆర్టెమిస్‌లో ఉన్న వ్యోమగాములు .. అంతరిక్షంలో ఉన్న అనేక గ్రహాలను ఫోటో తీశారు. భూమి, మెర్క్యూరీ, వీనస్, మార్స్, శని గ్రహాలను వ్యోమగాములు ఫోటో తీశారు. కేవలం ఆస్ట్రోనాట్స్ మాత్రమే వీక్షించగల గ్రహణాన్ని ప్రత్యేక కెమెరాలతో ఫోటోలు తీశారు. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ జర్నీ సమయంలో అనేక శాస్త్రీయ పరిశోధనలు కూడా చేపట్టారు. తమ ప్రయాణంలో ఓ అరుదైన సంపూర్ణ సూర్య గ్రహణాన్ని వీక్షించినట్లు ఆస్ట్రోనాట్స్ చెప్పారు. కాని దీన్ని వర్ణించడం అంత సులువైన అంశంకాదన్నారు. సుమారు ఏడు గంటల పాటు చంద్రుడి ఉపరితలాన్ని వ్యోమగాములు అబ్జర్వ్ చేశారు. కొత్తగా రెండు అగాధాలను గుర్తించినట్లు తెలుస్తోంది. వాటికి పేర్లు కూడా పెట్టారు. గతంలో వెళ్లిన స్పేస్‌క్రాఫ్ట్ ఇంటిగ్రిటీ పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు. రెండో క్రాటర్‌కు కారల్ అని నామకరణం చేశారు. ఆర్టెమిస్ మిషన్ కమాండర్ రీడ్ వైజ్‌మాన్ భార్య ఇటీవల క్యాన్సర్‌తో మృతిచెందిందింది. అతని భార్య పేరు కారల్. ఆమె పేరును ఓ క్రాటర్‌కు పెట్టారు. పేరు పెట్టే సమయంలో హూస్టన్‌లో ఓ నిమిషం పాటు మౌనం పాటించారు. చంద్రుడి ఆవలివైపు చూసిన ఆర్టెమిస్ వ్యోమగాములు తిరిగి భూమి వైపు పయనమయ్యారు. 10వ తేదీన భూమిపై ఆ ఆస్ట్రోనాట్స్ ల్యాండ్ అవుతారు.

# వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కి మోడీ అభినందనలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):** వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కు మంగళవారం ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. టో లామ్ నాయకత్వంలో న్యూఢిల్లీ, హనోరు మధ్య సంబంధాలు మరింత బలపడతాయని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వియత్నాం సోషలిస్ట్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కి నా హృదయ పూర్వక అభినందనలు. ఆయన నాయకత్వంలో భారత్- వియత్నాం దేశాల మధ్య



కాలపరీక్షకు నిలిచిన స్నేహం మరింత బలపడుతుందని నేను దృఢంగా నమ్ముతున్నాను. మన ప్రజల ప్రాంతం పురోగతి, శ్రేయస్సు కోసం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, మీతో కలిసి పని చేయడానికి నేను ఎదురుచూస్తున్నాను' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సిపివిసిసి) ప్రధాన కార్యదర్శిగా ఉన్న టో లామ్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంది. ఈయన పదవీకాలం ఐదేళ్లు (2026-2031) కొనసాగుతుంది. ఈ విషయాన్ని వియత్నాం జాతీయ అసెంబ్లీ మంగళవారం ధృవీకరించినట్లు జిన్హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

# 12న ఆదర్శ పాఠశాలలో 6 వ తరగతి ప్రవేశ పరీక్ష



**శిరివెళ్ళ (డ్రీమ్ టైమ్స్)**
శిరివెళ్ళఆదర్శ పాఠశాలలో ఈనెల 12న 6వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇస్రాత్ బేగం తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష 12న ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కేంద్రానికి కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లు ఏపీ వెబ్‌సైట్‌లో ఈనెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. లేని పక్షంలో హాల్ టికెట్ వివరాల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.హాల్ టికెట్ అవసరమైన విద్యార్థులు పాఠశాల పనివేళల్లో పాఠశాలను సంప్రదించాలని సూచించారు.

# కెసీ జలాలతో ఆనకట్టకు నీరు.



**శిరివెళ్ళ (డ్రీమ్ టైమ్స్)**
మండల కేంద్రంలోని ఆనకట్టకుంటను ఆళ్లగడ్డ శాసన సభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు కెసి కెనాల్ జలాలతో వీటిని నింపినట్లు డిప్యూటీ ఎంపీడీఓ శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ ఈఓ అశ్విన్ కుమార్ తెలియజేశారు.కేసి కెనాల్ 16వ లాకు నుండి ఉపకాలువ ద్వారా శిరివెళ్ల మెట్ట నుండి ఆనకట్ట కుంట వరకు జెసిబి సహాయంతో వంటకాలు శుభ్రం చేసి నీటిని మళ్లించినట్లు తెలిపారు. ముళ్ళ కంప పిచ్చి మొక్కలు బురద నీటిని తొలగించి కేసి జనాలతో ఆనకట్టకుంటకు నీటిని నింపినట్టు తెలియజేశారు. ప్రస్తుత వేసవిలో మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని శిరివెళ్ల మేజర్ గ్రామపంచాయతీ మరియు మజారా గ్రామం అయినటువంటి వెంకటేశ్వరపురంలోనీ ప్రజలు నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కోకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా కేసీ జలాలతో ఆనకట్టకుంటకు నీటిని మళ్లించామని అన్నారు. ఆనకట్టకుంటలో నీరు నిలువ ఉండడం వల్ల భూగర్భ జలాలు ఉత్పత్తి చెంది బోరు బావులలో నీరు పుష్కలంగా వస్తుందని తద్వారా సుమారు 25 వేలమంది జనం నిటి సమస్య నీటి ఎద్దడికి గురికాకుండా కుంటకు నీటిని మళ్లించామన్నారు. మూగజీవాలకు గ్రామచేస్తున్న బోరు బావుల కింద , సీడ్ వరి సాగు చేస్తున్న రైతన్నలకు ఆనకట్టకుంటలో నీటిని నింపడం వల్ల ఎంతగానో దోహదపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మమ్మ.



**రైల్వే కోడూరు ఏప్రిల్ 7 డ్రీమ్స్ టైమ్స్**
రైల్వే కోడూరు మండల పరిధిలోని అనంత రాజంపేట , సెట్టిగుంట, జ్యోతి కాలనీ, మాధవరం పోడు, యానాది పల్లి, వెంకటరెడ్డి పల్లి, అబ్బి నాయుడు , చియ్యవరంపల్లి గ్రామాలలో మంగళవారం రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ముక్కారూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మమ్మ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చూపించుకుని అప్పుల పాలైన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిది అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల కంటే ముఖ్యమంత్రి సహాయనిది మన రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఎక్కువ మందికి ముక్కారూపానందరెడ్డి స్వయంగా అమరావతికి వెళ్లి బాధితులకు నిధులు మంజూరు చేయించిన ఘనత ఆయనకి దక్కుతుందన్నారు. చెక్కులు తీసుకున్న బాధితులు ముక్కారూపానంద రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంహెచ్ చైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షుడు పోకల మణి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, నాగినేని బాలసుబ్రమణ్యం బ్రదర్స్, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలకు కొత్త గుర్తింపు

**- గుంతకల్లు డివిజన్ లో..**
**మండలాలు : 8**
**పంచాయతీలు : 162**
**జనాభా : 402819**
**కుటుంబాలు :146145**



**గుంతకల్లు, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
గ్రామ స్వరాజ్యం సాధించాలంటే పల్లెలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలి. ఈ దిశగానే కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలో పంచాయతీల పునర్వర్గీకరణకు ఇటీవల పచ్చ జెండా ఊపింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేస్తూ ఈనెల 9 వ తేదీన ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. జనాభా, ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని వీటిని వర్గీకరించనున్నారు. ప్రభుత్వం తాజాగా చేపట్టనున్న మార్పుల ప్రకారం ఇప్పటివరకూ మూడు విభాగాలుగా ఉన్న పంచాయతీలు.. ఇకపై నాలుగు రకాలుగా మారనున్నాయి. పెద్ద గ్రామాలను కొత్తగా రూర్బన్ పంచాయతీలుగా ఏర్పాటు చేస్తారు. ఇక్కడ పట్టణ తరహా సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గుంతకల్లు డివిజన్ పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి, యాడికి, పెద్దవడుగూరు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో అదనంగా మరో 8 పంచాయతీలను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు గతంలోనే ఉన్నాయి. ఇప్పటికే వీటికి సంబంధించి కసరత్తు పూర్తయింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే కొత్త పంచాయతీలు ఏర్పడతాయి. గుంతకల్లు డివిజన్ లో ప్రస్తుతం మొత్తం 162 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పట్టణాలకు ధీటుగా ఉండే పెద్ద గ్రామాలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తిస్తారు. దీనికి ఆ గ్రామంలో జనాభా 10 వేలకు పైగా ఉండాలి. వార్షిక ఆదాయం కోటి రూపాయల కంటే ఎక్కువ ఉండాలి. దీనికి ఆ గ్రామంలో జనాభా 10 వేలకు పైగా ఉండాలి. ఈ విషయంలో గిరిజన ప్రాంతాలకు మినహాయింపును ఇచ్చింది. గిరిజన ప్రాంతాల్లో 5 వేల జనాభాకు పైబడి ఉంటే వాటిని రూర్బన్ పంచాయతీగా చేసేందుకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం గుంతకల్లు డివిజన్ పరిధిలో పెద్దవడుగూరు, పామిడి, యాడికి, ఉరవకొండ మేజర్ పంచాయతీలు ఉన్నాయి. అత్యధిక జనాభా ఉన్నా.. జనాభా లెక్కలు పూర్తికాక ఇప్పటికీ కనీసం మేజర్ హోదా లభించని పంచాయతీలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజా పునర్వర్గీకరణతో గిరిజన ప్రాంతాల్లో చాలా పంచాయతీలకు ఈ హోదా లభిస్తుంది.

**గ్రేడ్ -1:**
3 వేల నుంచి 10 వేల మధ్య జనాభా.. వార్షిక ఆదాయం రూ.30 లక్షల నుంచి కోటి రూపాయల లోపు ఉండాలి. గిరిజన ప్రాంతాల్లో 2500 నుంచి 5 వేల మధ్య జనాభా ఉంటే చాలు.

**గ్రేడ్-2:**
జనాభా 2 వేల కంటే తక్కువ. గిరిజన ప్రాంతాల్లో 1500 నుంచి 2 వేల లోపు ఉన్నా సరిపోతుంది. గ్రేడ్ -3 పంచాయతీలకు 1500 కంటే తక్కువ జనాభా ఉండాలి.

**ప్రభుత్వానికి నివేదించాం:**
కొత్త పంచాయతీలకు సంబంధించి అవసరమైన కసరత్తు పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదించామని గుంతకల్లు డివిజన్ డెవలప్మెంట్ అధికారిణి (డిడిఓ) విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆమె 'డ్రీమ్ టైమ్స్' ప్రతినిధితో మాట్లాడారు. ఇప్పటివరకూ జనాభా ప్రాతిపదికన 14,15 వ ఆర్థిక సంఘం నిధులను ఆయా పంచాయతీలకు కేటాయిస్తూ వస్తున్నారు. పంచాయతీల పునర్వర్గీకరణ తరువాత పెరిగిన జనాభాకు అనుగుణంగా నిధులు విడుదలయ్యే అవకాశాలుంటాయన్నారు. దీనివల్ల పంచాయతీల్లో అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలు, అభివృద్ధి జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు.

# పండ్ల మండీలో అగ్ని ప్రమాదం

**-రూ.4లక్షల మేర ఆస్తి నష్టం**




**గుంతకల్లు, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):**
గుంతకల్లు పట్టణంలోని మొమినాబాద్ కు చెందిన ఖదీర్ బాష కు చెందిన పండ్ల మండీలో మంగళవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితుడు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖదీర్ బాష గుంతకల్లు పట్టణంలోని మోమినాబాద్ లో పండ్ల మండీ నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఎప్పటిలాగే యధావిధిగా పండ్ల మండీని తెరిచాడు. ఉదయం 11.30 గంటల సమయంలో మండీలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో పండ్ల మండీలో ఉన్న ట్రేలు మంటల్లో దగ్ధమయ్యాయి. పండ్ల మండీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పండ్లను కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు భయంతో బయటికి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో మండీ యజమాని ఊపిరి పీల్చుకున్నారు. అగ్ని ప్రమాద సంఘటన సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఖదీర్ బాష తెలిపాడు.

**సకాలంలో ప్రమాద సమాచారం తెలియడంతో.. మరింత ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం..!**
గుంతకల్లు పట్టణంలోని మోమీనాబాద్ లో ఖదీర్ చెందిన పండ్ల మండిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదం సంభవించిందని తెలియగానే తమ సిబ్బంది సకాలంలో స్పందించారని స్థానిక సహాయ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి (ఏడిఎఫ్ఓ) ఎన్ అశ్వర్థ తెలిపారు. హుటా హుటిన వెళ్లిన తమ సిబ్బంది అక్కడి మంటలను ఆర్పేసారన్నారు. దీంతో మరో ఐదు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరగకుండా నివారించగలిగామని చెప్పారు.

# మీడియా స్వేచ్ఛపై దాడులు అప్రజాస్వామికం:

**-జనసేన నేత నరసింహ**



**చిట్వేల్ ఏప్రిల్ 7 డ్రీమ్ టైమ్స్**
హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడి యత్నం జరగడం తీవ్రంగా ఖండనీయమని చిట్వేల్ మండలం జనసేన నాయకుడు మాదాసు నరసింహ అన్నారు. ఇటువంటి ఘటనలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, సమాజంలో తప్పు సందేశాన్ని ఇస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేమూరి రాధాకృష్ణ చేసిన విశ్లేషణను జీర్ణించుకోలేని వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు హింసాత్మక చర్యలకు దిగడం సరైంది కాదని విమర్శించారు. అభిప్రాయ భేదాలు ఉన్నప్పుడు వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఏ వ్యాఖ్యలు నచ్చకపోయినా ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ప్రతిస్పందించాలి గాని దాడులకు దిగడం చట్టవిరుద్ధమని జనసేన నాయకుడు నరసింహ హెచ్చరించారు. మీడియా సంస్థలు ప్రజలకు నిజాలను తెలియజేసే వేదికలని, వాటిపై దాడులు జరగడం మాట స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించిన ఘటనలను ఆయన గుర్తు చేశారు. అలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే మీడియా స్వేచ్ఛను కాపాడటం అత్యంత ముఖ్యమని, ఇలాంటి ఘటనలను ప్రజాస్వామ్యవాదులు, పత్రికా స్వేచ్ఛను ఆకాంక్షించే ప్రతి ఒక్కరూ ఖండించాలని జనసేన నాయకుడు మాదాసు నరసింహ పిలుపునిచ్చారు.

# సిపిఐ పాదయాత్రను విజయవంతం చేయండి..!

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పిలుపు**



**గుంతకల్లు, ఏప్రిల్ 7(డ్రీమ్ టైమ్స్):** ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 10 వ తేదీ నుండి 12 వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు చేపట్టనున్న పాదయాత్రలో గుంతకల్లు నియోజకవర్గం నుండి 500 మందికి తగ్గకుండా పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది.ఈ కార్యక్రమానికి సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరిట ఉన్న గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసిందన్నారు. దాని స్థానంలో ఎలాంటి హక్కు లేనటువంటి జి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టింది గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటివరకు హక్కుగా పొందుతున్న ఉపాధిని గ్రామీణ పేదలు కోల్పోయే పరిస్థితి నెలకొందన్నారు. అలాగే గతంలో కేంద్రం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా 10 శాతం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం భరించేది.. నేడు రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు భరించాల్సి ఉన్నందున అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేసే ప్రమాదం ఉన్నది. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసిన తర్వాత గ్రామీణ పేదలు ఆర్థిక స్థితిగతులు మరుగున పడిన విషయాన్ని అందరూ గుర్తిస్తున్నారు. కానీ కేంద్రంలో అధికారంలో అలాగే గత 12 ఏళ్ల మోడీ పాలనలో రైతులకు చేసింది ఏమి లేదు.. సంవత్సరానికి 6000 రూపాయలు రైతుల అకౌంట్ లో జమ చేస్తున్నారు. పింఛన్ కంటే హీనంగా పరిగణిస్తున్నారు. రైతుల హక్కుల నుండి విముక్తి కల్పించడానికి కూలీలు ఆత్మహత్యలు నివారించడానికి ప్రయత్నం చేయడం లేదు. ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాలు మారినా గ్రామీణ ప్రజలు బాధలు తగ్గడం లేదు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథ సిఫారసులు అమ్మలు గురించి ఉపన్యాసాలు తప్ప అమూల్ గురించి ఆలోచించడం లేదు. చివరికి కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో అధికారానికి వచ్చిన ఎన్ డి ఏ ప్రభుత్వం తీసుకు వచ్చి ఉపాధి హామీ పథకానికి తిలోదాకాలిస్తున్నారు. ఫలితంగా గ్రామీణులు మరింత కష్టాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది అన్నారు. కావున దేశంలో మొట్టమొదట ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన బండపల్లి గ్రామం వరకు భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవసాయ కార్మిక సంఘం కలిసి తలపెట్టినటువంటి పాదయాత్రను ఏప్రిల్ 10న అనంతపురంలో సతా గ్రామ్ నుండి ప్రారంభించి 12వ తేదీ వరకు పాదయాత్ర కార్యక్రమం కొనసాగుతుందన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ , సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్, భారత ట్రేడ్ మజ్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ, జాతీయ కార్యదర్శి వి. ఎస్ .నిర్మల, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిహెచ్ కోటేశ్వరరావు,ఆవుల శేఖర్ నాయకత్వాన ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరబద్రిస్వామి స్వామి, జిల్లా సహాయ కార్యదర్శి కె.దేవేంద్ర, హమాలి సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్, మండల కార్యదర్శి రాము, పట్టణ మండల సహాయ కార్య దర్శులు మురళీకృష్ణ, రామాంజనేయులు, యాదవ్, ఏఐటీయూసి అధ్యక్ష కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య,మల్లయ్య,మధు,శీనా, కొండయ్య, శంకరప్ప, కత్తి శీనా, రామాంజి, శివ, వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం





**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నాడు వైద్యాధికారి,ముకేశ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలచే ప్రపంచ ఆరోగ్య దినము నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి ముఖేష్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం" అనీ. మనిషికి ఎన్ని సిరిసంపదలు ఉన్నా, అనుభవించడానికి ఆరోగ్యం లేకపోతే అవన్నీ వృధానేప్రపంచవ్యాప్తంగా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7వ తేదీన “ప్రపంచ ఆరోగ్య దినోత్సవం" జరుపుకుంటారని తెలిపారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పడిన రోజును పురస్కరించుకుని, 1950 నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా నిర్వహిస్తున్నారనీ,అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన అంశాన్ని తీసుకుని, దానిపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నారన్నారు .ప్రజారోగ్యంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం దీన్ని ముఖ్య ఉద్దేశం అన్నారు.ప్రమాదకరమైన వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా చూడడంప్రభుత్వాలను ఆరోగ్య రంగంపై దృష్టి సారించేలా ప్రోత్సహించడం ప్రపంచ ఆరోగ్య దినము యొక్క ఉద్దేశం అన్నారు.ఆరోగ్యంగా ఉండటానికి

**పోషకాహారం:** సమతుల్య ఆహారం తీసుకోవాలి. తాజా పండ్లు, కూరగాయలు ఆహారంలో భాగం చేసుకోవాలనీ ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేయడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందనీ చేతులను శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల అంటువ్యాధులు దరిచేరవనీమానసిక ప్రశాంతత: యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలనీ రోజుకు 7 నుండి 8 గంటల గాఢ నిద్ర అవసరమన్నారు.జీవనశైలి వ్యాధుల నియంత్రణ మరియు అంటువ్యాధుల నియంత్రణ మాతా శిశు సంరక్షణ పైన భారత ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఆరోగ్యం అంటే కేవలం ఏ రోగము లేకుండా ఉండడమే కాదని మానసికంగా శారీరకంగా సామాజికంగా బాధ్యతగా ఉన్ననాడే అసలైన ఆరోగ్యమని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు నాయక్ సిహెచ్ఓ రామమోహన్ రెడ్డి పిహెచ్ఎన్ సరస్వతి సూపర్వైజర్ రవి కిషోర్ ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయలసీమ ద్రోహి చంద్రబాబు

**వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్ రెడ్డి విమర్శ**



**గుంతకల్లు ఏప్రిల్ 7 (డ్రీమ్ టైమ్స్):** రాయలసీమకు న్యాయ రాజధానిని దూరం చేసి, సాగునీటి ప్రాజెక్టులను అటకెక్కించి, సీమ గొంతు నొక్కేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని..ఈ గడ్డపై అడుగుపెట్టే నైతిక హక్కు ఆయనకు లేదని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై. రాజశేఖర్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు గుంతకల్లు నియోజకవర్గం గుత్తి పట్టణం కొత్తపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన వైసిపి ఐటీ విభాగం సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాయలసీమ దాహార్తిని తీర్చే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని పొరుగు రాష్ట్రం తెలంగాణతో చేతులు కలిపి కుట్రపూరితంగా ఆపివేయడం సీమ ప్రజలకు చేసిన అతిపెద్ద ద్రోహం అన్నారు. పట్టిసీమపై ఉన్న ప్రేమ సీమపై ఏది?: మధ్య కోస్తా కోసం పట్టిసీమ కట్టిన బాబుకు, రాయలసీమ పశ్చిమ ప్రాంత హెచ్ ఎల్ సి ఆయకట్టు స్థిరీకరణ కోసం తుంగభద్ర సమాంతర కాలువ నిర్మించాలనే ఆలోచన ఎందుకు రాలేదు?

**పెండింగ్‌లో ప్రాజెక్టులు:** కృష్ణా డెల్టా కోసం 69 జీవో తెచ్చిన చంద్రబాబు రాయలసీమలోని గాజు, కేసీ కెనాల్ ఆయకట్టు కోసం శంకుస్థాపన చేసిన 'గుండ్రేవుల వేదవతి' ప్రాజెక్టులను ఎందుకు విస్మరించారు? తరతరాలుగా పెండింగ్‌లో ఉన్న చిన్న కాలువలను పూర్తి చేయకుండా, కేవలం రిజర్వాయర్లలో నీటిని నిల్వ ఉంచి జల హారతులు, జలధారల పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని పబ్లిసిటీ కోసం తగలేస్తున్నారు. సీమలో కరువు రాక్షసి కోరలు చాస్తుంటే, ప్రజలు వలసలు పోతుంటే ప్రభుత్వం మాత్రం అమరావతి చుట్టూ భూసేకరణ చేస్తూ అభివృద్ధిని కేంద్రీకరిస్తోంది" అని మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్: కేంద్రంలోనూ భాగస్వామిగా ఉండి కూడా తుంగభద్ర, కృష్ణా నదులపై జాతీయ ప్రాజెక్టులను ఎందుకు సాధించలేకపోతున్నారు? తక్షణమే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించాలన్నారు.రాయలసీమకు న్యాయ రాజధానిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి రైతు విభాగం నాయకులు రామ రంగారెడ్డి, ఐటీ విభాగం మండల అధ్యక్షుడు మధుబాబు, ఓబులప్ప, రామాంజుల రెడ్డి, చంద్రబోస్ తదితరులు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

## అమరావతి రాష్ట్రపతి ఆమోదం పొందడం ఏపీ ప్రజల విజయం, సుధీర్ కుమార్ రాజు.



**రైల్వే కోడూరు, ఏప్రిల్ 7 డ్రీమ్స్ టైమ్స్** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం 2026 కు రాష్ట్ర రాజధానిగా అమరావతిని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేయడంతో రాజధాని కల సహకారమైందని తెలుగుదేశం పార్టీ యువ నాయకులు దాసరి రాజు సుధీర్ కుమార్ రాజుహర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం అండగా నిలిచిన ప్రధాని మోడీకి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, బిల్లుకు మద్దతు తెలిపిన ఎంపీలకు, తెలుగు ప్రజల తరఫున ఆయన ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యముగా అమరావతి రైతుల సహనం, త్యాగం, మరియు అంకితభవానికి సెల్యూట్ చేస్తున్నామన్నారు.వారి పోరాట ఫలితమే నేటి విజయమని ఇక అమరావతి నిర్మాణ దిశగా ముందుకు సాగుతుందని తెలిపారు. రాజధాని అమరావతి దశాబ్దాల నిరీక్షణకు తెరపడిందని, లక్షలాదిమంది రైతులు త్యాగం ఫలించిందని ఇక తెలుగువారు గర్వంగా గుండె నిండా అమరావతి రాజధానిని చెప్పుకుంటామని తెలిపారు .ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతిని ఇది ఒక కేవలం నగరం కాదు రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు వేదిక అని తెలిపారు. ఐదు కోట్ల మంది ఏకమై గెలిచిన అద్భుత విజయమని కొనియాడారు.

## సమస్యలు తెలియజేయండి

**- జనసేన నేత నాగార్జున పిలుపు**




**చిట్వేల్, ఏప్రిల్ 7 డ్రీమ్ టైమ్స్** మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ముందడుగు వేయాలని జనసేన నాయకులు, రాజుగుంట ఎంపీటీసీ నాన్న బాల నాగార్జున పిలుపునిచ్చారు. ఈ నెల 9వ తేదీన ఎంపీడీవో కార్యాలయంలో జరగనున్న సర్వసభ్య సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ, సర్వసభ్య సమావేశంలో ప్రతి ఒక్కరికీ మాట్లాడే అవకాశం లేకపోవచ్చని పేర్కొన్నారు. అందువల్ల మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ ప్రజలు తమ సమస్యలను ముందుగానే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను సమావేశంలో ప్రస్తావించి, సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మండలంలో విద్య, వైద్య సేవలు, త్రాగునీటి సరఫరా, సాగునీరు, ఉపాధి అవకాశాలు, వెలుగు, ఆర్టీసీ రవాణా, విద్యుత్ సరఫరా వంటి కీలక రంగాల్లో ఎదురవుతున్న సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. అలాగే ప్రజలు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా లేదా ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సమస్యలు సమగ్రంగా సేకరించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరి స్వరం వినిపించేలా కృషి చేస్తానని నాగార్జున స్పష్టం చేశారు.

## సొంత గ్రామం పంచలింగాలలో పర్యటించిన ఎంపీ బస్తిపాటి నాగరాజు




**కర్నూలు ఏప్రిల్ 7 డ్రీమ్ టైమ్స్** తన సొంత గ్రామం కర్నూలు మండలం లోని పంచలింగాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు...పంచలింగాల గ్రామంలో పర్యటించిన ఆయన, ఎంపీ నిధులు, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మిస్తున్న సీ.సీ రోడ్లు, డ్రైనేజజీ లతో పాటు, శిథిలావస్తకు చేరుకున్న పశు వైద్యశాలను పరిశీలించారు...ఈ సందర్భంగా ఎంపీ ని కలిసిన గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.. అనంతరం ఎంపీ మాట్లాడుతూ త్వరలోనే పంచలింగాల గ్రామం రూపు రేఖలు మారబోతున్నాయన్నారు...ఇక గ్రామ పంచాయితీ స్థలంలో కొన్ని అనివార్య కారణాలతో కొన్ని సంవత్సరాలుగా ఓ ఆలయ నిర్మాణం నిలిచిపోయిందని, వాటి స్థానంలో కొత్త పశు వైద్యశాలను నిర్మిస్తామని తెలిపారు...ఈ కార్యక్రమం లో గ్రామ టీడీపీ నాయకులు, రోడ్డు కాంట్రాక్టర్ నాగేష్ పాల్గొన్నారు..

# బిజినెస్

## టాప్‌గేర్‌లో ఈవీ అమ్మకాలు.
## 2025-26లో 24 లక్షల యూనిట్లు

**న్యూఢిల్లీ,**
దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ అంతకంతకూ పెరుగుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 24.52 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది అమ్ముడైన వాహనాలతో పోలిస్తే ఇది 24.6 శాతం అధికమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్(ఫాడా) ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. వీటిలో 14 లక్షల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అమ్ముడవగా, 2 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహనాలు ఉన్నాయన్నారు. దేశీయ ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగంలో గతేడాది చిరస్థాయిగా మిగిలిపోనున్నట్టు, ద్వి-త్రి చక్ర వాహనాలతోపాటు ప్యాసింజర్, కమర్షియల్ వాహనాలు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నట్టు చెప్పారు.




గతేడాది 1,99,923 యూనిట్ల ప్యాసింజర్ ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. కిందటేడాది అమ్ముడైన 1,08,873 యూనిట్లతో పోలిస్తే ఇది 83.63 శాతం అధికం
టాటా మోటర్స్ అత్యధికంగా 78,811 యూనిట్ల పీవీలను విక్రయించింది. అలాగే ఎంజీ మోటర్ 53,089 యూనిట్లు, మహీంద్రా 42,721 యూనిట్ల వాహనాలను విక్రయించాయి.
గతేడాది 14,01,818 యూనిట్ల ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. వీటిలో టీవీఎస్ 3,41,513 యూనిట్లు అమ్ముడవగా, బజాజ్ 2,89,349 యూనిట్లు, ఏథర్ 2,39,178 యూనిట్లను విక్రయించాయి.

## నాలుగోరోజూ లాభాల్లో సూచీలు..

**-సెన్సెక్స్ 510, నిఫ్టీ 155 పాయింట్ల లాభం**



**ముంబై, ఏప్రిల్ 7**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు మదుపరుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ప్రారంభంలో నష్టపోయిన సూచీలకు ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. 1,400 పాయింట్ల శ్రేణిలో కదలాడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 509.73 పాయింట్లు ఎగబాకి 74,616.58 పాయింట్ల వద్ద నిలిచింది.మరో సూచీ నిఫ్టీ 155.40 పాయింట్లు అందుకొని 23.123.65 పాయింట్లకు చేరుకున్నది. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతు సూచీలు లాభాల్లోకి రావడానికి దోహదపడ్డాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు నష్టపోయాయి.

## మహీంద్రా, స్వరాజ్ ట్రాక్టర్లు ప్రియం

ముంబై, ఏప్రిల్ 7
మహీంద్రా ట్రాక్టర్లు మరింత ప్రియంకాబోతున్నాయి. ఈ నెల 8 నుంచి అమల్లోకి వచ్చేలా అన్ని రకాల ట్రాక్టర్ల ధరలను సవరిస్తున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఎంత శాతం మేర పెంచుతున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు.ఉత్పత్తి వ్యయం అధికం కావడం ధరలు పెంచాల్సి వస్తున్నదని మహీంద్రా గ్రూపు వర్గాలు వెల్లడించాయి. అలాగే స్వరాజ్ ట్రాక్టర్స్ కూడా ఈ నెల 21 నుంచి అమల్లోకి వచ్చేలా ధరలను సవరిస్తున్నట్టు తెలిపింది




# స్పోర్ట్స్

## రాయల్స్ హ్యాట్రిక్..
## ముంబైపై ఘన విజయం

### జైస్వాల్ అజేయ అర్ధసెంచరీ




**ఐపీఎల్ -2026**

| జట్లు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 3 | 3 | 0 | 0 | 6 | 2.403 |
| పంజాబ్ | 3 | 2 | 0 | 1 | 5 | 0.637 |
| బెంగళూరు | 2 | 2 | 0 | 0 | 4 | 2.501 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 0 | 4 | 1.170 |
| హైదరాబాద్ | 3 | 1 | 2 | 0 | 2 | 0.275 |
| లక్నో | 2 | 1 | 1 | 0 | 2 | -0.542 |
| ముంబై | 3 | 1 | 2 | 0 | 2 | -0.715 |
| కోల్‌కతా | 3 | 0 | 2 | 1 | 1 | -1.384 |
| గుజరాత్ | 2 | 0 | 2 | 0 | 0 | -0.424 |
| చెన్నై | 3 | 0 | 3 | 0 | 0 | -2.517 |

**గువాహటి**
ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. మంగళవారం జరిగిన పోరులో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. తద్వారా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో హ్యాట్రిక్ విజయాలతో రాయల్స్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. రాజస్థాన్ నిర్దేశించిన 151 పరుగుల లక్ష్యఛేదనలో ముంబై 123/9 స్కోరుకు పరిమితమైంది. బర్గర్, బిష్ణోయ్, సందీప్ రెండేసి వికెట్లు తీశారు. టాపార్డర్ త్రయం రోహిత్‌శర్మ(5), రికల్టన్(8), సూర్యకుమార్(6)తో సహా కెప్టెన్ హార్దిక్‌పాండ్యా(9), తిలక్‌వర్మ(14) ఘోరంగా విఫలమయ్యారు. వర్షం అంతరాయం కారణంగా సుమారు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైన మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. కాగా ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్.. 11 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (32 బంతుల్లో 77లి, 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు అర్ధ శతకానికి తోడు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (14 బంతుల్లో 39, 1 ఫోర్, 5 సిక్స్‌లు) వీరవిహారంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

**దొరికిన బంతిని దొరికనట్టు..**
4, 6, 4, 4, 4.. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన రాయల్స్‌కు తొలి ఓవర్లోనే జైస్వాల్ అందించిన ఆరంభమది. 3.2 ఓవర్లకు కుదించిన పవర్ ప్లేలో జైస్వాల్, వైభవ్ కండల్లో కరెంటు నింపుకుని వచ్చినట్టుగా దొరికిన బంతిని దొరికినట్టుగా బౌండరీ లైన్ దాటించడంతో రాయల్స్ రన్‌రేట్ 20కి తగ్గకుండా సాగింది. ఈ మ్యాచ్‌కు ముందు వైభవ్.. బుమ్రాను ఎలా ఎదుర్కుంటాడనేదానిపై అందరూ ఆసక్తిగా ఎదురుచూడగా అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఈ బీహార్ కుర్రాడు స్టార్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. బుమ్రా, బౌల్ట్‌ను క్లబ్ స్థాయి బౌలర్లుగా మార్చేసి ధనాధన్ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. బుమ్రా బౌలింగ్‌లో తాను ఎదుర్కున్న తొలి నాలుగు బంతుల్లో రెండు భారీ సిక్స్‌లు బాదిన అతడు ఆ తర్వాత బౌల్ట్ ఓవర్లోనూ స్కేర్ లెగ్ మీదుగా కళ్లు చెదిరే సిక్స్ కొట్టాడు. శార్దూల్ ఐదో ఓవర్లోనూ 6, 4, 6 దంచిన వైభవ్.. ఆఖరి బంతికి ఎక్స్‌ట్రా కవర్స్ మీదుగా భారీ షాట్ ఆడినా అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న తిలక్ వర్మకు చిక్కడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 4.6 ఓవర్లలోనే 80 రన్స్ జతచేయడం విశేషం. ఆ తర్వాత జురెల్ (2)ను గజన్‌ఫర్ పెవిలియన్‌కు పంపగా హార్దిక్ 8వ ఓవర్లో బౌండరీతో యశస్వీ వరుసగా రెండో ఫిఫ్టీని పూర్తిచేశాడు. రెండు సిక్స్‌లు, ఒక బౌండరీతో ఊపు మీద కనిపించిన కెప్టెన్ పరాగ్ (20)నూ గజన్‌ఫర్ బోల్తా కొట్టించాడు. శార్దూల్ విసిరిన ఆఖరి ఓవర్లో 18 రన్స్ రాబట్టిన జైస్వాల్.. ఇన్నింగ్స్‌కు అదిరిపోయే ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

**ముంబై పోరాడినా..**
11 ఓవర్లలో 151 పరుగుల ఛేదనతో బరిలోకి దిగిన ముంబైకి ఆదిలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. ఆర్చర్ ఇన్నింగ్స్ మొదటి ఓవర్ ఆఖరి బంతికి రికల్టన్‌ను ఔట్ చేసి అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. భారీ సిక్స్‌తో దూకుడు మీద కనిపించిన రికల్టన్..మరో షాట్ ఆడే ప్రయత్నంలో కీపర్ చేతికి చిక్కాడు. వచ్చి రావడంతోనే తనదైన శైలిలో సిక్స్ కొట్టిన సూర్యకుమార్ ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. బర్గర్ బౌలింగ్‌లో బౌండరీ దగ్గర ఆర్చర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. రెండు పరుగుల తేడాతో రోహిత్‌శర్మ..సందీప్‌శర్మ బౌలింగ్‌లో వికెట్ల ముందు అడ్డంగా దొరికిపోయాడు, బౌలింగ్ మార్పుగా వచ్చిన స్పిన్నర్ రవి బిష్ణోయ్ మూడు బంతుల వ్యవధిలో హార్దిక్‌తో పాటు తిలక్‌ను పెవిలియన్‌కు పంపాడు. దీంతో ముంబై 46 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో రూథర్‌ఫర్డ్(25), నమన్ ధీర్(25) దూకుడుగా ఆడినా..ముంబై గెలుపు వాకిట నిలువలేకపోయింది.

**సంక్షిప్త స్కోర్లు**
రాజస్థాన్: 11 ఓవర్లలో150/3 (జైస్వాల్ 77లి, వైభవ్ 39, గజన్‌ఫర్ 2/21, శార్దూల్ 1/36);
ముంబై: 11 ఓవర్లలో 123/9 (రూథర్‌ఫర్డ్ 25, నమన్ 25, బిష్ణోయ్ 2/25, బర్గర్ 2/21)

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో వార్నర్ అరెస్ట్



సిడ్నీ : పరిమితికి మించి మద్యం సేవించి కారు నడిపిన కేసులో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్‌ను ఆస్ట్రేలియా పోలీసులు అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్న వార్నర్.. ఏడు రోజులు సెలవు దొరకడంతో స్వదేశానికి వెళ్లాడు.మంగళవారం అతడు మద్యం తాగి కారును డ్రైవ్ చేస్తుండగా మరోబ్ర అనే ప్రాంతలో పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయడంతో ఆ పరీక్షలో అతడికి పాజిటివ్ వచ్చింది. దీంతో వార్నర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత బెయిల్‌పై విడిచిపెట్టారు. త్వరలోనే పాక్‌కు రానున్న వార్నర్.. వచ్చే నెలలో కోర్టుకు హాజరవుతాడని సమాచారం.



## అందాలు ఆరబోస్తున్న ఉప్పెన బ్యూటీ!




# హైదరాబాద్ నేపథ్యంలో అనన్యా పాండే కొత్త సినిమా..

## 'చాంద్ మేరా దిల్' టీజర్ రిలీజ్

బాలీవుడ్ యువ నటి అనన్యా పాండే, 'కిల్' సినిమాతో మెప్పించిన లక్ష్య జంటగా నటిస్తున్న కొత్త సినిమా 'చాంద్ మేరా దిల్'. ఈ సినిమా మే 22న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. హైదరాబాద్ నేపథ్యంలో రాబోతున్న ఈ టీజర్ చూస్తుంటే.. ఇదొక స్వచ్ఛమైన క్యాంపస్ లవ్ స్టోరీ అని అర్థమవుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ కాలేజీలో ఆరవ్, చాందిని అనే ఇద్దరు విద్యార్థుల మధ్య మొదలైన ప్రేమ, ఆ తర్వాత వారి జీవితాల్లో ఎదురైన మలుపులు, బాధాకరమైన సంఘటనలను ఈ సినిమాలో చాలా ఎమోషనల్‌గా చూపించబోతున్నారు.మరో విశేషమేమిటంటే, ఈ సినిమా షూటింగ్ ఎక్కువ భాగం హైదరాబాద్‌లోనే జరిగింది, ఇది తెలుగు ప్రేక్షకులకు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తోంది. సచిన్-జిగర్ అందించిన మ్యూజిక్ సినిమాకు పెద్ద ప్లస్ కానుంది. నిజానికి ఈ సినిమా ఏప్రిల్‌లోనే రిలీజ్ కావాల్సి ఉంది, కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా వేసి, ఇప్పుడు మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

# అట్లీ, అల్లు అర్జున్ మూవీ పోస్టర్ విడుదల




అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. 'ఎఎ22ఎక్స్ 6'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం దీని టైటిల్‌ను ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ విషయాన్ని తెలుపుతూ టీమ్ పంచుకున్న పోస్టర్ అందరిలో ఆసక్తి కలిగించింది. సాధారణంగా టైటిల్ ప్రకటన అంటే హీరో లుక్‌కు సంబంధించిన పోస్టర్‌ను పంచుకుంటారు. కానీ టీమ్ మాత్రం జంతువు పంజా ఉన్న పోస్టర్‌ను షేర్ చేసింది. దీంతో ఈ సినిమా థీమ్‌పై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నారంటూ కామెంట్స్ చేస్తున్నారు. పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడి ఉండే సైన్స్‌ఫిక్షన్ మూవీగా ఇది ముస్తాబవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో అల్లు అర్జున్ పాత్ర మూడు కోణాల్లో సాగుతుందని సమాచారం. మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ వినియోగంతో పాటు... విజువల్ ఎఫెక్ట్స్‌కి పెద్దపీట వేస్తూ ఈ సినిమాని భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలు ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో దీపికా పదుకొణె పేరు ఇప్పటికే ఖరారైంది.

# ఆ ప్రేమను ఎప్పటికీ మర్చిపోలేను..

## నాకు నేనే సర్‌ప్రైజ్ అవ్వడం ఇష్టం అంటున్న మృణాల్

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ పాన్-ఇండియా యాక్షన్-రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంతో షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శేష్ సరసన మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా నటించారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాటీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. డెకాయిట్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మృణాల్ ఠాకూర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.డెకాయిట్ లో చేసిన సరస్వతి క్యారెక్టర్ చాలా డిఫికల్ట్. అయితే మేకర్స్ ఆ క్యారెక్టర్‌ను యాక్టర్‌కు సులభంగా అర్థమయ్యేలా తీర్చిదిద్దారు. ఒక యాక్టర్‌కు ఛాలెంజ్ ఉన్న క్యారెక్టర్ చేయడం ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుంది. సరస్వతి క్యారెక్టర్ చేయడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చింది. ఈ క్యారెక్టర్‌ను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. నా కెరీర్‌లో ఇది చాలా డిఫరెంట్ రోల్. ఇప్పటివరకు నేను చేయని కొత్త జానర్ ఇది. తప్పకుండా ఈ క్యారెక్టర్ అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో కొన్ని స్టంట్స్ కూడా చేశాను. చేజింగ్ సన్నివేశాలు, డ్రైవింగ్ సీన్స్ చాలా ఎంజాయ్ చేశాను.సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ చిత్రాలతో తెలుగు ఆడియన్స్ నన్ను ఒక తెలుగు అమ్మాయి లాగా అంగీకరించారు. వారి ప్రేమాభిమానాలు ఎప్పటికీ మర్చిపోలేను. మంచి పాత్రలు చేస్తాననే నమ్మకం వారికి ఉంది. సరస్వతి పాత్ర కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది. నాకు ఎప్పుడూ ఎక్స్‌పెరిమెంట్ చేయాలని ఉంటుంది. అలాగే నాకు నేనే సర్ప్రైజ్ అవ్వడం ఇష్టం. అలాంటి అవకాశం ఇచ్చిన సినిమా ఇది. నాకు కొత్త ఎమోషన్స్ ఉన్న సినిమాలు చేయాలనిపిస్తుంది. ఇప్పటివరకు చేయని క్యారెక్టర్లు చేయాలనే తపన ఉంటుంది. డెకాయిట్ కూడా అలాంటి కొత్త జానర్ సినిమా అని చెప్పుకొచ్చింది మృణాల్.



# ప్రభాస్‌తో ఆదిత్య ధర్ మూవీ



'ధురంధర్ 2' ఘన విజయం తర్వాత దర్శకుడు ఆదిత్య ధర్ పేరు ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి, రికార్డుల సునామీ సృష్టించడంతో ఆయన తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. తాజా సమాచారం ప్రకారం, ఆదిత్య ధర్ ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుడుతున్నారని తెలుస్తోంది.టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీలను కలిపి పాన్ ఇండియా స్థాయిలో ఇండియన్ సినిమాను షేక్ చేసేలా ఓ మల్టీస్టారర్‌ను తెరకెక్కించాలనే ఆలోచనలో ఉన్నారట. ఆ చిత్రంలో ప్రభాస్,సూర్య కలిసి నటించబోతున్నారని బాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రాజెక్ట్ హై వోల్టేజ్ మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఉండబోతోందని టాక్. ఇద్దరు స్టార్ హీరోలు కావడంతో వారి పాత్రలకు సమాన ప్రాధాన్యం ఉండేలా పవర్‌ఫుల్ క్యారెక్టర్స్‌ను రూపొందిస్తున్నారని సమాచారం. కథ కూడా పాన్ ఇండియా రేంజ్‌లో ఉండి, దేశ విదేశాల్లోని పలు ఇంటర్నేషనల్ లొకేషన్స్‌లో షూటింగ్ ఎలాన్ చేస్తున్నారట.ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్, సూర్యకు ఉన్న నటనా ప్రతిభ ఈ రెండు కలిస్తే బాక్సాఫీస్ వద్ద భారీ సంచలనం ఖాయం అని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ డ్రామా మధ్య మంచి బ్యాలెన్స్ ఉండేలా స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారట. అయితే ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ వార్తలు సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతూ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రభాస్, సూర్య కాంబినేషన్ నిజమైతే ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌గా నిలుస్తుందని ఫ్యాన్స్ ఇప్పటికే అంచనాలు పెంచుకుంటున్నారు. ఇక అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831